ఆహ్లాదం పొందేదెలా..?


గణేశ్‌పూర్ ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు


ఈ ఫొటోలో కనిపిస్తున్నది మండలంలోని కోమటిగూడ పల్లె ప్రకృతి వనం. ఈ వనంలో ఒకే రకమైన మొక్కలు దర్శనమిస్తాయి. పూల మొక్కలు ఉండవు. పండ్ల చెట్లు కానరావు. కొన్ని నెలలుగా పార్కు గేటు పడిపోయి ఉండడంతో నిత్యం పశువులు సంచరిస్తుంటాయి. ఇలాంటి అధ్వాన పరిస్థితులు కలిగిన పల్లె ప్రకృతి వనాలు మండలంలో అనేకం ఉన్నాయి.

- పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువు
- నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు
- మండలంలో 96 పల్లె ప్రకృతి వనాలు

వాంకిడి: పల్లెల్లోని ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పల్లెకు ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మొదట్లో ప్రతీ గ్రామంలో ఒక ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల్లోని లక్షల రూపాయలు వెచ్చించి వనాలకు గేట్లు, పశువులు లోనికి వెళ్లకుండా చుట్టూ ఫెన్సింగ్ నిర్మించారు. రెండేళ్ల పాటు మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వంటి వాటిపై దృష్టి సారించారు. కాని ప్రస్తుతం ప్రకృతి వనాల నిర్వహణ గాలికి వదిలేశారు.

నిర్వహణ మరిచారు..

గ్రామ పంచాయతీల్లోని ప్రతీ గ్రామానికి ఒక పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం వనాల్లో అందమైన పూల మొక్కలు, పండ్ల మొక్కలతో పాటు ఇతర వృక్షజాతి మొక్కలు నాటాల్సి ఉంది. కానీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గ్రామాల్లో ఆహ్లాదం కానరావడం లేదు. పార్కులో వాకింగ్ ట్రాక్‌లు, రకరకాల పూల, పండ్ల మొక్కలు నాటాల్సి ఉంటుంది. వీటితో పాటు చెట్ల కింద సేద తీరేందుకు బెంచీలు సైతం ఏర్పాటు చేయాలి. వీటి నిర్వహణ మొత్తం గ్రామ పంచాయతీల పైనే ఉంటుంది. కానీ మండలంలోని చాలా పార్కుల్లో సౌకర్యాలు కానరావడం లేదు. కొన్ని పార్కుల్లో స్థానికంగా లభించే మొక్కలను నాటారు. కొన్ని చోట్ల ఒకే రకమైన మొక్కలను వేల సంఖ్యలో నాటడంతో ప్రకృతి వనాలు అడవులను తలపిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్‌లు కూడా కానరానంతగా మొక్కలు, గడ్డి పేరుకుపోవడంతో పార్కుల్లో అడుగు పెట్టేందుకు ప్రజలు జంకుతున్నారు.

ఎండిపోతున్న మొక్కలు..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాల్లోని మొక్కలకు సంరక్షణ కరువైంది. ప్రకృతి వనాలకు ఏర్పాటు చేసిన గేట్లు పడిపోతున్నా, ఫెన్సింగ్‌లు తెగిపోతున్నా అధికారులు మాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో పశువులు పార్కుల్లోకి వెళ్లి మొక్కలను తినేస్తున్నాయి. అంతేకాకుండా మొక్కలకు నీరు పట్టకపోవడం, దీనికి తోడు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతుండటంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రతీ సంవత్సరం చనిపోయిన మొక్కల స్థానాల్లో కొత్త వాటిని మారుస్తున్నప్పటికీ నిర్వహణ సరిగా లేక ఎండిపోతున్నాయి. దీంతో ప్రజా ధనం వృథా అవుతుంది. ప్రకృతి వనాల నిర్వహణపై ఎంపీవో శివకుమార్‌ను వివరణ కోరగా మొక్కలకు నీరు అందించి, సంరక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సమస్యలపై వెంటనే స్పందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మోతీరాం


హాజరైన సభ్యులు, అధికారులు

- మూడు నెలల్లో అధికారులు పరిష్కారం చూపాలి
- విద్యుత్ తీగలను సరిచేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మోతీరాం

కెరమెరి: సర్వసభ్య సమావేశంలో దృష్టికొచ్చిన సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఎంపీపీ పెందోర్ మోతీరాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, జెడ్పీటీసీ సెద్మకి దుర్పత బాయితో కలిసి నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే మండల సభలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సమస్యలకు పరిష్కారం చూపిన కాపీలను వెంట తీసుకురావాలని ఇదివరకే తెలియజేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడాలని, సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు.

అధికారులపై ప్రశ్నల వర్షం

సమావేశంలో సర్పంచ్ న్యానేశ్వర్ మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఎప్పుడు అందజేస్తారని ప్రశ్నించారు. 33శాతం కంటే అధికంగా నష్టం జరిగితేనే పరిహారం అందుతుందని దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఏవో గోపికాంత్ తెలిపారు. రెండు రోజుల నుంచి ఝరి, మోడి, భోలాపటార్, అంతాపూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని జెడ్పీటీసీ దుర్పత బాయి, వైస్ ఎంపీపీ కలాం పేర్కొన్నారు. మన ఊరు– మన బడి ద్వారా మండలంలోని 19 పాఠశాలల్లో మరమ్మతుల పనులు జరుగుతున్నాయని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ తెలిపారు. కోతుల బెడద ఉన్నట్లు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్‌వో నాగేశ్వర్ పేర్కొన్నారు. కొద్ది రోజులుగా భారీ వర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సబ్ ఇంజనీర్ రమేశ్, ఎల్ఐ రాజశేఖర్ తెలిపారు. ఝరి, గోయగాం గ్రామాల్లో తీగలు వేలాడుతున్నాయని వాటిని సరి చేయాలని, చెరువులపై ఉన్న తీగలు కూడా అలాగే ఉన్నాయని వైస్ ఎంపీపీ కలాం సభా దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్లను వెల్‌నెస్ సెంటర్లుగా ప్రభుత్వం మార్చిందని, వాటిల్లో అన్ని పరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారి వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు మతీన్ అహ్మద్, సత్యనారాయణగౌడ్, సుదర్శన్, నజిమొద్దీన్, స్టీవెన్, గోపీకాంత్, పురుషోత్తం, వెంకటేశ్, ఆడే ప్రకాశ్, మల్లయ్య, జగదీశ్వర్, లత, కుమారి, నాగేశ్వర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు అప్పగించొద్దని వినతి


జావిద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

తిర్యాణి: విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించొద్దని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో జావెద్‌కు వినతిపత్రం అందజేశారు. సమ్మె బాట పట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల బాధ్యతలు కూడా తమకు అప్పగిస్తే పని భారం పెరుగుతుందన్నారు. అదనపు బాధ్యతలపై విముఖత తెలియజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, మాధవ్ ఉన్నారు.

ఎడ్లు మాయం.. రైతుల ఫిర్యాదు

వాంకిడి: మండలానికి చెందిన పలువురి ఎడ్లు దొంగతనానికి గురైనట్లు రైతులు ఫిర్యాదు చేశారని శనివారం ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన ఇటన్‌కార్ సుభాష్ అనే రైతుకు 3 వ్యవసాయ ఎడ్లు ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో రోజూ మాదిరి శుక్రవారం కూడా మేతకు బయటకు వదిలాడు. అయితే సాయంత్రం రెండు ఎడ్లు మాత్రమే ఇంటికి తిరిగి వచ్చాయి. మరో ఎద్దు రాకపోవడంతో గ్రామ శివారుల్లో వెతికాడు. అయినా ఆచూకీ లభించలేదు. తప్పిపోయిన ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని రైతు వాపోయాడు. వాంకిడి గ్రామానికి చెందిన మెంగ్రె బాపురావు అనే రైతుకు చెందిన ఒక ఎద్దు కూడా తప్పిపోయినట్లు పేర్కొన్నాడు. ఎడ్లు దొంగతనానికి గురై ఉంటాయని రైతు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటన్‌కార్ సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీ బిడ్డలు శాస్త్రవేత్తలుగా ఎదగాలి


గుస్సాడీ రాజును శాలువాతో సత్కరిస్తున్న నారాయణ

కెరమెరి(జైనూర్): ఆదివాసీ బిడ్డలు శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ సూచించారు. శనివారం మండలంలోని మార్లావాయి గ్రామాన్ని సందర్శించారు. ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ దంపతులకు వారి విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత గుస్సాడీ రాజు ఇంటికి వెళ్లి అతడిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైమన్‌డార్ఫ్ దంపతులు ఆదివాసీలకు ఎనలేని సేవ చేశారని తెలిపారు. పరదేశస్తులైనా మనకోసం ఇక్కడ ఉండి మన భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలను ప్రభుత్వానికి తెలియజేసిన గొప్పవ్యక్తులని కొనియాడారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాల సాధనకు అహర్నిషలు కృషి చేయాలని, కష్టపడే తత్వం ఉన్న వారు ఎప్పుడూ ఓడిపోరని తెలిపారు. పచ్చదనం–పరిశుభ్రత, పర్యావరణం గురించి యూనివర్సిటీ విద్యార్థులతో త్వరలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆతర భుజంగ్‌రావు, సర్పంచ్ కనక ప్రతిభ, ఉపసర్పంచ్ సావిత్రి, నాయకులు కొద్దు, మానిక్‌రావు, గణపతి, నగేశ్, రాజేశ్ తదితరులున్నారు.

'జేఈఈ అడ్వాన్స్‌డ్'కు మోడల్ స్కూల్ విద్యార్థిని


అర్చన

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని అర్చన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. శనివారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 60.8మార్కులతో ఎస్టీ కేటగిరిలో ఆల్ ఇండియా 10423 ర్యాంక్ సాధించి అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు మంత్రికి ఆహ్వానం

నార్నూర్: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 12 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. హ్వానించారు. ఈసందర్భంగా మంత్రి చేతుల మీదుగా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నార్నూర్: సామాజిక సేవ భావంతో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని మండలంలోని ఖంపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్ అన్నారు. శనివారం జైనూర్ మండలంలోని హసేపల్లి గ్రామానికి కాంబ్లే రమేశ్ కూమార్తె వివాహానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్‌ను గ్రామస్తులు అభినందించారు.

క్లుప్తంగా

కాంట్రాక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల సన్మానం


సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దహెగాం: పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం పెద్దవాగుపై వంతెన నిర్మాణంతో దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల ప్రజలకు రాకపోకలు సులువుగా మారుతాయని మండల రైతుబంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్ అన్నారు. శనివారం కమ్మర్‌గాం –దిగిడ గ్రామాల మధ్యలో వాగుపై పూర్తయిన వంతెనను పరిశీలించి వేగంగా వంతెన నిర్మాణం పూర్తి చేసిన కాంట్రాక్టర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ బాధ్యతలు తాత్కాలికంగా అప్పగింత

దహెగాం: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో మండలంలోని ఎఫ్ఏలు, టీఏలు, ఐకేపీ సీసీలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి తాత్కాలికంగా ఆయా పంచాయతీల బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు.

నేడు వాసవీమాత జయంతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో వాసవీమాత జయంతిని ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు వాసవీమాత ఉత్సవ విగ్రహంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఆరోగ్య బీమా చేసుకోవాలి

కౌటాల: ప్రతీ ఒక్కరు ఆరోగ్యబీమా చేసుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ నరసింహస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో లబ్ధిదారులకు ఆరోగ్యబీమా నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన బ్యాంకు ఖాతాదారులు ఎస్‌బీఐ జనరల్ ఆరోగ్య ప్లస్ పథకంలో బీమా చేసుకోవాలని సూచించారు. కౌటాలకు చెందిన లబ్ధిదారుడు వెంకటేశ్వర్‌కు పథకంలో భాగంగా రూ.52వేల నగదును ఆయన ఖాతాలో జమ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న కేసీఆర్ సేవాదళం సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజల దాహార్తి తీర్చేందుకు అంబలి పంపిణీ చేస్తున్నట్లు కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు ఉబేద్ బిన్ యాహియా (తారిఖ్) తెలిపారు. జిల్లాకేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి కోసం ప్రతీ ఏడాది పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు తనయుడు ఆత్రం అవినాష్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : రైటర్ పద్మభూషణ్
కాగజ్‌నగర్
వెంకటరమణ : రైటర్ పద్మభూషణ్
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంత	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

ఎల్కపల్లిలో పౌరహక్కుల దినోత్సవం


ఆసిఫాబాద్‌రూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ రామ్మోహన్ రావు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఘనపురం కావ్య అధ్యక్షతన శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ సరిత మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. పౌరులకు ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా కల్పిస్తున్న సేవలను వివరించారు. ఎంపీడీవో గంగాసింగ్, ఏఎస్సై గంగరాం, ఎంపీటీసీ రాజన్న పాల్గొన్నారు.

సమాజంలో అంటరానితనం రూపుమాపాలి

ఆసిఫాబాద్‌రూరల్: సమాజంలో అంటరానితనం రూపుమాపాలని తహసీల్దార్ రామ్మోహన్ రావు అన్నారు. శనివారం మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో పౌరహక్కుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పౌరులు తమ హక్కులను వినియోగించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తేనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ ఈడీ సజీవన్, ఎస్సై రమణ, ఆర్ఐ భీర్‌షా, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు కేశవరావు, సర్పంచ్, ఉపసర్పంచ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండలంలోని దొడ్డిగూడ గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహీముద్దీన్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌరహక్కులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టం దృష్టిలో కుల వివక్ష, అంటరానితనం నేరమన్నారు. చట్టాలను తెలుసుకుని ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశపరీక్ష ప్రశాంతం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం నిర్వహించిన నవోదయ 6వ తరగతి ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నవోదయ ప్రవేశపరీక్ష కేంద్రంలో మొత్తం 337 మంది విద్యార్థులకు గాను 308 మంది విద్యార్థులు హాజరయ్యారని, 29 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్ సత్యనారాయణ తెలిపారు. సిర్పూర్(టి) ఎస్సై రమేశ్ పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లు అప్పగింత


ఫోన్లు అప్పగిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్

వాంకిడి: పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ట్రాక్ చేసి పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వారి ఫోన్లు పోయినట్లు ఫిర్యాదు చేయగా గుర్తించి శనివారం బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మానసిక దివ్యాంగురాలికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్సై భూమేశ్

రెబ్బెన: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలికి పోలీసులు చేయూత అందించారు. గ్రామానికి చెందిన అయిల్లా రమేశ్ కూతురు స్వరూపకు 23 సంవత్సరాలు. మానసిక దివ్యాంగురాలు కావడంతో కొంత కాలం నుంచి మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవటంతో విషయం తెలుసుకున్న ఎస్సై ఎల్. భూమేశ్ బాధిత కుటుంబ సభ్యులకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులతో పాటు రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


బడె ముత్తయ్య (ఫైల్)

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రహ్మన్‌చిచ్యాల గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బడె ముత్తయ్య(45) అనే ఉపాధి కూలీ రోజూ వారీగానే శనివారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తున్న క్రమంలో ఇబ్బంది పడ్డాడు. మధ్యలోనే ఇంటికి వచ్చిన ముత్తయ్యను కుటుంబ సభ్యులు దహెగాం పీహెచ్‌సీకి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. పరీక్షించిన వైద్య సిబ్బంది గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

మే 3న కూతురి వివాహం

బడె ముత్తయ్యకు ఇద్దరు సంతానం కాగా కూతురి వివాహం మే 3న జరగాల్సి ఉంది. నాలుగు రోజుల్లో కూతురి వివాహం ఉండగా ముత్తయ్య మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

మేడే పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: 137వ మేడేను పురస్కరించుకొని శనివారం పట్టణంలోని గాంధీ చౌక్ పార్కులో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎండీ. చాంద్ పాషా ఆధ్వర్యంలో మేడే పోస్టర్లను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కార్మిక వర్గ చట్టాలను, హక్కులను పరిరక్షించడంతో పాటు అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడి ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతోందన్నారు.

రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో గోపీకాంత్

కెరమెరి: రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించి రశీదులను వ్యాపారులు తప్పకుండా ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి ఎస్. గోపీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని సీడ్స్, ఫర్టిలైజర్స్ షాపులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడారు. నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. రికార్డులు సరైన విధంగా నమోదు చేయాలన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన


ప్లాస్టిక్‌రహిత వస్తువులను ఎంపీడీవోకు అందజేస్తున్న ఎస్పీఎం ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణపై మల్టీపర్పస్ వర్కర్లకు అవగాహన కల్పించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ఎస్పీఎం జనరల్ మేనేజర్ గిరి, మోహన్‌రావులు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, చెత్తను రిసైక్లింగ్ ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.